# సదువు



శ్రీదేవి రెడ్డి

“అమ్మా...” సీతమ్మ పిలిచింది.

“ఏందే...” సీతమ్మ తల్లి గంగమ్మ పలుకుతూ అంది.

“నేను కూలికి బోనమ్మా రేపట్నుంచీ.”

“ఎందుకే?”

“నాకు సదుకోవాలని వుంది.”

“సదువా?”

“అవునమ్మా” రెడ్డి బిడ్డ కళ్ళల్లో మెదుల్తుంటే చెప్పింది సీతమ్మ.

“మనబోటోళ్ళ కెందుకే సదువు?” గంగమ్మ అంది.

“సదుకొని రెడ్డి బిడ్డలాగ ఎంగిలీసు మాట్లాడాలని వుంది. ఇంకా పెద్ద ఉజ్జోగం సేయాలని వుంది” పసి మనసులోని కోరికని తల్లి ముందు నివేదించుకుంది సీతమ్మ.

“గట్లాంటివన్నీ మనకి కుదరవే. మనం కూలి జేసుకుని బతికెటోళ్ళం. అయినా రెడ్డి బిడ్డతో నీకెందుకే పోలికా...”

“పోలిక కాదమ్మా. గట్ల సదుకోవాలని వుంది.”

“ఏం సదువులోనే... గవి మనకి అచ్చిరావు. నీవు కూలికి బోతుండబట్టే గదా బయానా తీసుకుని కడుపుకి తింటున్నాం.” తల్లి అనగానే

“నీవూ నాయిన ట్రాక్టరు కూలికి బోతరు గదా” ఇక నేనెందుకనే అర్థంతో అంది సీతమ్మ.

“అంద్రం బోతున్నాం కాబట్టే గదా ఇంత కూడు తింటున్నాం. లేదంటే మన సంసారానికి బుక్కెడు కూడు దొరకదు” గంగమ్మ అంది.

“ఏమోనమ్మా నేను సదూకుంటానే. రెండో తరగతి సదివేదాన్ని. కూలి కోసం మాన్పించారు. మల్ల పోతానే ఇస్కూల్‌కి” దీనంగా అడిగింది సీతమ్మ.

“ఏం సదువుకుంటావే? పీసులు గట్టనీకే మనతో ఏం గతి వుంది?”

ఇటు పడుకున్న సీతమ్మ ఎటెటో ఆలోచిస్తూ మరోసారి కళ్ళనీళ్ళు తుడ్చుకుని కందీలు గుడ్డివెల్తురులో అరచేతుల్ని చూసుకుంది.

చిగురాకుటాకుల్లాంటి చేతులు మొరటుదేలడం మొదలెట్టాయి.

చూస్తూ అనుకుంది సీతమ్మ.

“కురుమన్న సామీ నీకు కోటి దండాలు బెడ్తా! నా సేతుల్లో సదువు గీతని గియ్యి!”

కొట్టంలో పడుకున్న సీతమ్మకి అవతల వీధిలో వుండే రెండస్తుల బంగళా స్పష్టంగా కన్పిస్తుంది. లైట్ల వెల్తురులో ప్రకాశిస్తోందా ఇల్లు. ఆ ఇంటి పెద్దాయన పెద్ద జామీన్‌దారు. అతడి కొడుకు పట్నంలో డాక్టరు. డాక్టరు బాబుకి తన వయసు పిల్లలే వుంటారు.

* * *

“సీతమ్మ నువ్వు ఇంక కూలికి పోవద్దే” గంగమ్మ చెప్పింది.

“నిజంగానా?” కళ్ళను చారడేసి చేసి అంది సీతమ్మ.

“అవును.”

“మరేం సేయాలి?”

“ఇంకేం సేయాలి? నీ ఇష్టప్రకారం సదుకోవాలి.”

“అవునా... నిజంగానా... సత్తెంగా ...” నమ్మలేనంత ఉత్సాహం సీతమ్మ కళ్ళల్లో.

“ఈరోజు సాలెకి పో. రేపొచ్చి అయ్య పేరెక్కిస్తాడు.”

“గట్లే” ఆనందంగా ఎగురుతూ దొడ్లోకి వెళ్ళి గబగబా స్నానం కానించడానికి తడకల జాలట్లో దూరింది సీతమ్మ.

“ఆస తీరుతుంది” పట్టలేని ఆనందం ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే అనుకుని ఐదు నింషాల్లో స్నానం ముగించింది.

“పెద్దోళ్ళ పిల్లలంతా సదువుకుంటున్నారు. నిన్నూ సదివించి పెద్దోళ్ళలాగ తయారు సేయాలి. అందుకే ఇంక రోజు సాలెకి వెళ్ళండి.”

సీతమ్మ అద్దం ముందు కూర్చొని బొట్టు పెట్టుకుంటుంటే అంది గంగమ్మ.

సీతమ్మకి ప్రపంచాన్ని జయించినంత ఆనందంగా వుంది.

“బుక్కులు నీవన్నీ శాటలికి వొండి వూసాం గదా! కొత్త బుక్కులు అన్నీ రేపే కొనిగిస్తాడులే. అయ్యా!”

“గట్లేలే నే వొస్తానమ్మా” చెప్పి ఇంట్లోంచి బయటికి పరుగు లంకించుకుంది సీతమ్మ.

విషయాన్ని అందరితో చెప్పకుంటూ ముందుకెళ్తుంది.

వింటున్న తోటి పిల్లలంతా తామూ సీతమ్మలా చదువుకోవాలన్నట్టుగా ఆశపడ్తూనే వున్నారు.

స్కూల్లోకి అడుగు పెట్టింది సీతమ్మ.

“స్కూల్‌కి కొత్తా” ఓ అమ్మాయి వచ్చి అడిగింది.

అవునన్నట్టుగా తలూపింది సీతమ్మ.

“ఎన్నవ తరగతి?”

“ఇదే ఇస్కూల్లో రెండో తరగతి సగం వరకు సదివి బందేసిపాయిన”

“అంటే మళ్ళీ చదువుకోవాలని వచ్చావా?”

“అవును.”

“లెక్కల మాస్టారు లెక్కలు రాకపోతే కొడ్తారు తెల్సా?”

“కొట్టనీ. కొడ్తుంటే అవే వొస్తుంటయ్.”

“అమ్మో... ధైర్యవంతురాలివి”

“నువ్వు ఎన్నో తర్గతి?” అడిగింది సీతమ్మ.

“నేనూ రెండవ తరగతి. మరి నువ్వు మొదట్నుంచి చదువుతావా మళ్ళీ?”

“అవును”

“అక్కడ కూర్చుందాం పద”

* * *

“సీతమ్మా సీతమ్మా” దుప్పటి పట్టి లాగింది గంగమ్మ.

ఉలిక్కిపాటుగా కళ్ళు తెరిచి చూసింది సీతమ్మ.

“బారెడు పొద్దెక్కింది. కూలీ టైం గూడా అయింది. ఇంకా పండుకున్నవేమే... లేవు...” గట్టిగా అంటున్న తల్లిని చూస్తూ మంచం దిగిన సీతమ్మకి అర్థమైంది.

ఆమెలో కలలు రాత్రి వేళ పూస్తున్నాయి పగలు రాల్తున్నాయి...

“తొరగా రుద్దు” చెప్పి వెళ్ళిపోయింది గంగమ్మ.

సీతమ్మ ఐదు నిమిషాల్లో ముఖం కడుక్కుని ఇంట్లోకి వెళ్ళింది.

అప్పటికే తల్లి సద్ది రెడీ చేసి పెట్టింది.

ఆ పనీ ఈ పనీ తర్వాత గంటకి సద్ది చేతుల్లోకి తీసుకుని కూలికి ప్రయాణమైంది సీతమ్మ.

వెళ్తుంటే మధ్యలో రామకోటిరెడ్డి సైకిల్ మోటర్‌పై కూతుర్ని కొడుకుని కూర్చోబెట్టుకుని పక్క టౌన్‌లో వున్న ప్రైవేట్ స్కూల్లో వదిలిపెట్టి రావడానికి వెళ్తున్నాడు.

చూసిన సీతమ్మ కళ్ళల్లో నిరాశా నిట్టూర్పులు!

అందుకే అనుకుంది—

‘రెడ్డి కడుపులనన్న పుట్టకబోతీ... సదూకుంటుంటీ...’